## మండలంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

లింగాల, అక్టోబర్ 5: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్‌లో చేరికల పరంపర కొనసాగుతుందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని అవుసలికుంట సర్పంచ్ బండి ఎల్లయ్యతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరగా.. విప్ గువ్వల కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు.

## మంత్రి కేటీఆర్ సభా స్థలం పరిశీలన

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 5: అచ్చంపేట పట్టణంలో ఈనెల 8వ తేదీన నిర్వహించే మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు స్థలాన్ని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు గురువారం పరిశీలించారని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభకు వచ్చే ప్రజలకు తగిన సదుపాయాల కోసం ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, బీఆర్ఎస్ నాయకులు అమీనొద్దీన్, లోక్యానాయక్, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం 'కల్యాణలక్ష్మి'

ఉప్పునుంతల, అక్టోబర్ 5: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరంలాంటిదని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పేర్కొన్నారు. గురువారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పునుంతల మండలానికి చెందిన 17మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ గువ్వల మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదింటి ఆడపడచులకు కల్యాణలక్ష్మి ప్రవేశపెట్టి పేదవారి ఇండ్లల్లో సీఎం కేసీఆర్ మేనమామగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రావు, అచ్చంపేట పాలశీతలీకరణకేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

# దసరా కానుకగా బతుకమ్మ సారె



బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

- ప్రభుత్వ విప్ డాక్టర్ గువ్వల బాలరాజు
- అచ్చంపేటలో బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభం

అచ్చంపేట, అక్టోబర్ 5: గ్రామాలు, పల్లెల్లోని ఆడబిడ్డలు ఆనందంతో ఉండేలా సీఎం కేసీఆర్ దసరా పండుగ కానుకగా బతుకమ్మ చీరలను అందజేస్తున్నారని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. గురువారం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ గువ్వల మాట్లాడుతూ.. ఆడబిడ్డల సంతోషమే ప్రభుత్వ లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు ఇస్తే జీర్ణించుకోవడం లేదన్నారు. చీరలపైన కూడా రాజకీయం చేస్తున్నారని, సీఎం కేసీఆర్ పెద్ద మనస్సుతో ఆడపడుచులను గౌరవించుకునేందుకు చీరలు ఇస్తే తట్టుకోలేక ఎక్కడా మహిళలు కేసీఆర్‌వైపు నిలబడుతారోనని కళ్లుమండి చీరలపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఆడబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల కళ్లలో ఆనందం చూసేందుకు ప్రతిఏటా దసరా బతుకమ్మ చీరలు అందజేస్తున్నారన్నారు. మహిళలు సంఘటితంగా ఉండాలన్నారు.రాష్ట్రంలోని అన్నివర్గాలను గౌరవించేందుకు సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అతీగతిలేని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక ప్రతి అంశాన్ని రాజకీయం చేసి ప్రజల్లో చులుకన కావొద్దని సూచించారు. రాష్ట్రప్రజల కోసం అన్నీ చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరాం, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, వైస్ చైర్మన్ శైలజారెడ్డి, ఎంపీపీ శాంతాభాయి, జెడ్పీటీసీ రాంబాబు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి

- 8న కేటీఆర్‌తో ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన
- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు
- చెన్నారం జీపీ, పీర్లచావిడికి భూమిపూజ

బల్మూరు, అక్టోబర్ 5: తెలంగాణలో సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈనెల 8న ఉమామహేశ్వర ప్రాజెక్ట్‌కు మంత్రి కేటీఆర్‌చే భూమిపూజ చేయనున్నట్లు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. గురువారం మండలంలోని చెన్నారంలో నూతన జీపీ భవనం, పీర్లచావిడికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీపీ భవనానికి సర్పంచ్ గట్టు రవిచంద్రారెడ్డి స్థలం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. గ్రామంలో ప్రతివీధిలో సీసీ రోడ్లను వేయించినట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అభివృద్ధి శూన్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మి, విండోచైర్మన్ నర్సయ్య, ఉపసర్పంచ్ నిరంజన్, కార్యదర్శి బాలరాజు, నాయకులు చుక్కారెడ్డి, నాగేశ్వర్‌రావు, రాజురెడ్డి, మల్లేశ్, శివ, లింగం, విష్ణు తదితరులు ఉన్నారు.



జీపీ భవనానికి భూమిపూజ చేస్తున్న విప్ గువ్వల బాలరాజు

## తెలంగాణ రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక



విద్యార్థి రాజేశ్‌కు క్రికెట్ కిట్టును అందిస్తున్న కళాశాల బృందం

అమ్రాబాద్, అక్టోబర్ 5: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాజేశ్‌రాథోడ్ తెలంగాణ రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విద్యార్థి రాజేశ్‌ను అభినందించారు. 13వ స్కూల్ ఆఫ్ క్రికెట్ అసోసియేషన్ అండర్-19 ఆధ్వర్యంలో నేషనల్ చాంపియన్ షిప్-2023 చెన్నైలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. నల్లమల ప్రాంతంలోని విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో రాణించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అదేవిధంగా విద్యార్థికి క్రికెట్ కిట్టును అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపనులకు సహకరించాలి

- ఎంపీపీ అరుణ




మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

బల్మూరు, అక్టోబర్ 5: గ్రామాల అభివృద్ధికి అధికారులు బాధ్యతగా సహకరించాలని ఎంపీపీ అరుణ పేర్కొన్నారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచులు, సంబంధింత అధికారులు రాని సమావేశం వాయిదా వేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకపోయినా పట్టించుకోవడంలేదన్నారు. ముఖ్యంగా విద్యుత్, నీళ్ల, ప్రగతిపథంలో చేసిన పనులకు సంబంధించిన వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. అధికారులు సమావేశాలకు నామమాత్రంగా హాజరవుతున్నారని, ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. కార్యక్రమంలో డీఈ బాష్యునాయక్, తాసీల్దార్ సలీమొద్దిన్, ఎంపీడీవో దేవన్న, విండోచైర్మన్ చంద్రమోహన్, జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ నారాయణ, ఎంపీటీసీలు ఆంజనేయులు, అంకులయ్య, లక్ష్మీదేవమ్మ, సర్పంచులు, అధికారులు తదితరులు ఉన్నారు.

### మంత్రి కేటీఆర్ సభకు తరలిరావలి

ఈనెల 8న మండలంలోని మైలారం శివారులో ఉమామహేశ్వర ప్రాజెక్ట్‌కు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేయనున్నారని, మంత్రిసభకు మండలంలోని కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచు శివశంకర్, సహదేవు, రవిచంద్రారెడ్డి, తిరుపతిరావు, సువర్ణ, నాగరాజు, అంజమ్మ, నాయకులు రాజేందర్‌గౌడ్, అశోక్‌రావు, రాములు, కాశన్న తదితరులు ఉన్నారు.

## 11మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలు

అమ్రాబాద్, అక్టోబర్ 5: అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో 11 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలను దక్కించుకున్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన ఐదుగురు, పదర మండల కేంద్రానికి చెందిన ఆరుగురు పలు విభాగాల్లో పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటినుంచి చీరల పంపిణీ

లింగాల, అక్టోబర్ 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి మండలంలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో గీతాంజలి గురువారం తెలిపారు. మండలంలోని 23పంచాయతీల్లో మొత్తం 1,640 చీరలు వచ్చినట్లు తెలిపారు. రేషన్ డీలర్లు, కార్యదర్శులు ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అంకిరోనిపల్లిలో స్వచ్ఛసర్వేక్షన్

అచ్చంపేటరూరల్, అక్టోబర్ 5: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అంకిరోనిపల్లిలో స్వచ్ఛసర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో రోడ్లు ఊడ్చి బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు ఆర్డీటీ శ్రీశైలం రీజియన్ ఎస్టీఎల్ సిద్ధన్న తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్టీవో గువ్వని నరేశ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని భూ అభివృద్ధి విభాగంలో దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. సంస్థ సహకారంతో సబ్సిడీపై రైతుల భూమిలో అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. రైతులు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంకిరోనిపల్లిలో ప్రధాన వీధులను శుభ్రం చేస్తున్న రైతులు



గువ్వలోనిపల్లిలో శ్రమదానంలో పాల్గొన్న మహిళా రైతులు

## అచ్చంపేట జెడ్పీటీసీ దిష్టిబొమ్మ దహనం

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 5: అనామకుడిగా ఉన్న మంత్రియా నాయక్‌ను తల్లిలాంటి బీఆర్ఎస్ ఆదరించి జెడ్పీటీసీని చేస్తే మేలు మరిచి కీడు ఎంచినట్లు బీఆర్ఎస్‌ను వీడినా రాబోయే కాలంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని దుబ్బతండా సర్పంచ్ బాణావత్ కిషన్‌నాయక్ అన్నారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జెడ్పీటీసీ స్వగ్రామం దుబ్బతండానేనని.. ఆయన వెంట ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త కూడా వెళ్లడని స్పష్టం చేశారు. పదవులను అనుభవించి పార్టీ మారినంత మాత్రాన ప్రజలు గుడ్డిగా తనవెంట వెళ్లరని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. అనంతరం అంబేద్కర్‌చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి జెడ్పీటీసీ మంత్రియానాయక్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



జెడ్పీటీసీ దిష్టిబొమ్మను తీసుకెళ్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు